

వరి కోత .. కన్నీటి వెత

చేతికొచ్చిన వరి పంటను కోసేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భూములు తేమతోనే ఉన్నాయి. వివరాలు 8లో ▸



బాలుర ఛాంప్ వరంగల్

హ్యాండ్‌బాల్ ఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలికల చాంపియన్‌గా ఆదిలాబాద్, బాలుర చాంపియన్‌గా వరంగల్ జట్టు నిలిచింది. వివరాలు 8లో ▸



ఘనంగా సదర్ ఉత్సవాలు

గుమ్మడిదల మండలంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

రామలింగేశ్వర దేవస్థానంలో లక్ష పుష్పార్చన



శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో స్వామివారు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శివాలయాల్లో కార్తీకమాసం రెండో సోమవారం నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయాల అర్చకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో సాయంత్రం లక్ష పుష్పార్చనతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్ తెలిపారు. అదేవిధంగా జేపీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు అర్చకులు నరేందర్ తెలిపారు.

జూమ్ మీటింగ్‌లో ఎంపీ షెట్కార్



జూమ్‌మీటింగ్‌లో పాల్గొన్న ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలతోపాటు అక్కడి నాందేడ్ పార్లమెంటు స్థానానికి ఉప ఎన్నిక ఈ నెలలో జరగనుంది. ఈ నేపథ్యంలో నాందేడ్ పార్లమెంటు స్థానం పరిధికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పార్టీ ఇన్‌చార్జిగా జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను నియమించింది. ఆదివారం నాగ్‌పూర్‌లో ఎన్నికల మేనిఫెస్టోను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేసిన అనంతరం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో నాందేడ్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థితోపాటు ఆ పార్లమెంట్ స్థానం పరిధిలోని అసెంబ్లీ స్థానాల అభ్యర్థులతో కలసి షెట్కార్ పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖర్గే సూచించారని షెట్కార్ తెలిపారు.

గురుకులంలో ఆర్వోప్లాంట్ మరమ్మతులు చేపట్టండి

గురుకులంలో అస్వస్థతపై స్పందించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ శివార్లలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులంలో పాడైపోయిన ఆర్వో ప్లాంట్‌ను వెంటనే మరమ్మతు చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. గురుకులంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన అంశంపై పత్రికల్లో రావడం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, బీసీ గురుకులం రాష్ట్ర కార్యదర్శి సైదులు, రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్సీవో) సంతోషి స్పందించారు. పిల్లల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తుండటంతో గురుకులం ప్రిన్సిపాల్ వడిత్యా శ్రీనివాస్‌పై వీరు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం గురుకులాన్ని సందర్శించి మరమ్మతులగురించి ప్రిన్సిపాల్‌కు ఆదేశించినా నిర్లక్ష్యం వహించడంపై సంజీవరెడ్డి బీసీ గురుకులం రాష్ట్ర కార్యదర్శి సైదులు దృష్టికి తీసుకెళ్లారు. చెడిపోయిన ఆర్వో ప్లాంట్ వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థులకు మినరల్ వాటర్ అందించాలని కార్యదర్శి సైదులు ఖేడ్ గురుకులం ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కోరారు. ఆదివారం తన నివాస గృహంలో ఖేడ్ పట్టణంతోపాటు, మాయికోడ్‌కు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేదల సంక్షేమానికి ప్రభుత్వం వివిధ పథకాలను అందిస్తోందన్నారు. పార్టీలకతీతంగా అర్హులకు ప్రాధా న్యతనిస్తున్నామన్నారు. అంతకుముందు ఖేడ్‌లో ఆదర్శ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శాఖను ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రాంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, టీపీసీసీ సభ్యులు మున్నూరి కిషన్, బ్యాంకు సీఈవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫికరే!

రామచంద్రాపురం ఫ్లైఓవర్ పనులను త్వరగా చేయాలంటున్న స్థానికులు

నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు తప్పని ఇబ్బందులు



నిర్మాణంలో ఫ్లైఓవర్ పనులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు రామచంద్రాపురం పట్టణంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు కాస్తా నత్తనడకన సాగుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారింది. నిత్యం ఉదయం, సాయంత్రం, రాత్రి సమయంలో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. దాంతో వాహనదారులు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు..

రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్ నుంచి లింగంపల్లి చౌరస్తా, శేరిలింగంపల్లి పరిధిలో చందానగర్ వరకు నిత్యం ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. రాత్రి సమయంలో దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల కారణంగా ట్రాఫిక్ సమస్య జటిలంగా మారడంతో ప్రభుత్వం 2022లో చందానగర్ నుంచి రామచంద్రాపురం జ్యోతినగర్ వరకు జాతీయరహదారిపై ఫ్లైఓవర్‌ను మంజూరు చేసింది. దీన్ని నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో రూ.130కోట్లు మంజూరు చేసింది. 2022 అక్టోబర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పనులు వాస్తవానికి 2024 అక్టోబర్ నాటికి పూర్తి చేయాల్సివుంది.

మారిన ప్రణాళిక...

ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాక నిర్మాణంలో ప్లానింగ్ మార్పులు చేయాల్సివచ్చింది. దీంతో కొంతకాలం పనులకు బ్రేక్ పడింది. పనులు ఆలస్యమవడానికి అధికారులు ఇదొక కారణంగా చెబుతున్నారు. దీంతోపాటు భారీ వర్షాల కారణంగా పనులను కొంతకాలం వాయిదా వేయాల్సి రావడం కూడా ఆలస్యానికి కారణంగా పేర్కొంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

రాత్రి సమయంలో లింగంపల్లి చౌరస్తా వద్ద గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ మార్గంలో ప్రయాణం అంటే ప్రజలు భయపడిపోతున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం పనులను వేగవంతం చేయాలి.

– పి.హర్షవర్ధన్ రెడ్డి, పటాన్‌చెరు



లింగంపల్లి చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్

సంక్రాంతి నాటికి అందుబాటులోకి

వచ్చే సంక్రాంతి పండుగలోపు ఫ్లైఓవర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన జంక్షన్ పనులను వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

పనులు వేగవంతంగా జరుగుతున్నాయి




సంక్రాంతి పండుగకల్లా ఈ ఫ్లైఓవర్‌పై వాహనాలు రాకపోకలు సాగించేవిధంగా పనులు పూర్తి చేస్తాం. ఆ దిశగా పనులు వేగవంతం చేస్తున్నాం.

– రామకృష్ణ, డీఈ, ఆర్‌అండ్‌బీ

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

● జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



గొంగ్లూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

పుల్‌కల్(అందోల్): కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పుల్‌కల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్రాంతి తనిఖీ చేశారు. కొనుగోళ్ల ప్రక్రియను రైతులనుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు గొంగ్లూర్ గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే ప్రజలు సర్వే అధికారులకు సహకరించి పూర్తి వివరాలు అందించాలని సూచించారు. ప్రజలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైనందున ఎన్యుమరేటర్‌లు ప్రజలతో మమేకమై సర్వే చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సర్వేలో కురుమలంతా పాల్గొనాలి

● సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి

నారాయణఖేడ్: ప్రభుత్వం నిర్వహిస్తున్న కుటుంబ సర్వేలో కురుమలంతా పాల్గొని తమ కులం కురుమ కులంగా నమోదు చేయించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి కోరారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సంఘ రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కులం స్థానంలో కురుమ, బీసీ(బీ), క్రమసంఖ్య 11, కాపరులు తమ వృత్తి గొర్రెల కాపరి అని నమోదు చేయించాలన్నారు. గతంలో కొందరు గొల్లకురుమలు యాదవులుగా నమోదు చేయించడంతో రాష్ట్రంలో కురుమల జనాభా తక్కువగా ఉన్నట్లు నమోదైందన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్, కిష్టయ్య, రమేశ్, జిల్లా శాఖ అధ్యక్షుడు మల్లేశం, వివిధ జిల్లాల బాధ్యులు రమణ, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాపు మల్‌శెట్టి

ఆదాయం ఉన్నా.. ఆధునీకరణ ఏదీ!

● దశ మారని జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్



మార్కెట్ యార్డులో పేరుకుపోయిన చెత్త. శిథిలావస్థకు చేరిన గోదాం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఆదాయం ఫుల్‌గా వస్తున్నా ఆధునీకరణకు మాత్రం నోచుకోవడం లేదు. కోట్ల ఆదాయం సమకూరుతున్నా మార్కెట్‌లో మాత్రం కనీస సౌకర్యాలను కల్పించడంలేదు. ఏళ్ల క్రితం నిర్మించిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైంది. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులు దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ మార్కెట్‌ను ఆధునీకరించాలని నిర్ణయించింది. అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఈలోపు కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో సదరు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైపోయాయి. దీంతో జహీరాబాద్ వ్యవసాయమార్కెట్ దశ మారలేదు.

కర్ణాటక సరిహద్దు ప్రాంతాలనుంచి...

జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను 73 ఏళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేశారు. పట్టణంలోని సెంటర్‌లో మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న మార్కెట్‌కు జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్, న్యాల్‌కల్, మునిపల్లి మండలాలతోపాటు కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి రైతులు పండించిన ధాన్యం అమ్మకాల కోసం ఇక్కడికి తీసుకొస్తుంటారు. దీంతో సీజన్‌లో ఎప్పుడూ వ్యవసాయ మార్కెట్ సందడిగా ఉంటుంది. కమీషన్, దుకాణాల అద్దెల ద్వారా మార్కెట్‌కు సుమారు రూ.2 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. 2008లో ప్రత్యేకశ్రేణి కింద అప్‌గ్రేడ్ చేశారు. కానీ ఆధునీకరణ పనులు మాత్రం చేపట్టలేదు.

ప్రతిపాదనలకే పరిమితం

వ్యాపారాలు విస్తరించడంతో స్థలం సరిపోవడం లేదు. దశాబ్దాల క్రితం నిర్మించిన గోదాం తదితర భవనాలు శిథిలావస్థకు చేరాయి. చెత్తా చెదారం పేరుకుని పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది. సరిపడా మూత్రశాలలు లేక గోదాం గోడలకు మూత్ర విసర్జన చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్‌ను ఆధునీకరించాలని గత ప్రభుత్వం హయాంలో నిర్ణయించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశాల మేరకు మూడేళ్ల క్రితం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శిథిలమైన గోదాంలు, దుకాణాల స్థానంలో కొత్తవి కట్టాలని యోచించారు. ప్రభుత్వం మారండంతో ఆధునీకరణ పనులకు బ్రేక్ పడింది. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ తీసుకుని జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను ఆధునీకరించాలని రైతులు కోరుతున్నారు.

కులగణనతో బీసీలకు ప్రాధాన్యత

దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు

హత్నూర(సంగారెడ్డి): కులగణనతో బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత పెరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నీలం మధు పేర్కొన్నారు. ఆదివారం హత్నూర మాధుర గ్రామ శివారులోని దత్తాచల క్షేత్రంలో దత్తాత్రేయ స్వామివారిని నీలం మధు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రాధిపతి సభాపతి శర్మ నీలం మధుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి ఆశీర్వాదం అందించారు. . అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంతోపాటు దేశంలో కూడా కులగణన జరిగితే బీసీలకు బడుగు బలహీన వర్గాలకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. దత్తాత్రేయ స్వామి అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నాని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, మాజీ సర్పంచ్ వీరస్వామి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



దత్తాచల క్షేత్రంలో పార్టీ నాయకులతో నీలం మధు



సంగారెడ్డి మాతా శిశు కేంద్రం

నేనూ వస్తా బిడ్డో.. సర్కారు దవాఖానకు

సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో ప్రసూతి, ఇతర వైద్యసేవలు భేష్

- అక్టోబర్ నెలలో రికార్డు స్థాయిలో 836 ప్రసవాలు
- ఇతర జిల్లాల నుంచీ ప్రసవాల కోసం వస్తున్న గర్భిణులు

సంగారెడ్డి: బిడ్డకు జన్మనివ్వడం అంటే తల్లికి పునర్జన్మలాంటిదంటారు. గర్భిణులకు అటువంటి బాధ లేకుండా అందరితో భేష్ అనిపించుకునే రీతిలో ప్రసూతి వైద్య సేవల్ని అందిస్తోంది సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి. ప్రసూతి సేవలతోపాటు ఇతర వైద్య సేవల్లోనూ రోగులకు కొండంత అండగా నిలుస్తూ అటు ప్రజలనుంచి ఇటు ప్రభుత్వం నుంచి ప్రశంసల్ని పొందుతోంది ఈ ఆస్పత్రి. అందుకే జిల్లా కేంద్రంలోని ఈ ఆసుపత్రికి ఇతర జిల్లాలనుంచి కూడా రోగులు, గర్భిణులు వచ్చి ఉచిత వైద్యసేవలు పొందుతున్నారు. ఈ ఆస్పత్రిలో ఎంతో అనుభవం కలిగిన జనరల్ ఫిజీషియన్లు, సర్జన్లు, గైనకాలజిస్టులు రోగులకు వైద్య సేవల్ని అందిస్తున్నారు. జనరల్ ఆస్పత్రిలో ఉన్న కీలకమైన విభాగం మాతా శిశు కేంద్రంలో నిత్యం ఎంతోమందికి కాన్పులు చేస్తారు. కాన్పుల్లో సాధారణ ప్రసవాలు కొన్ని అయితే తప్పని పరిస్థితుల్లో చేసే సిజేరియన్ కాన్పులు కూడా ఉంటున్నాయి.

అత్యధిక ప్రసవాలు ఇక్కడే...

రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రులతో పోలిస్తే ఇక్కడ అత్యధిక ప్రసవాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తున్న సంగారెడ్డి ప్రభుత్వ మాతా శిశు కేంద్రంలో రోజు నుంచి 40 కాన్పులు జరుగుతున్నాయి. అందులో 20కి పైగా సాధారణ ప్రసవాలను చేస్తున్నట్లు ఇక్కడి వైద్యులు చెబుతున్నారు. ఒక్క అక్టోబర్ నెలలోనే రికార్డు స్థాయిలో 836 కాన్పులు కాగా అందులో 377 ఆపరేషన్లు అయితే అంతకంటే ఎక్కువగా 459 సాధారణ ప్రసవాలను ఇక్కడి వైద్యులు చేశారు. దీంతో ప్రైవేటులో చికిత్స చేయించుకోవాలనుకున్న ధనికులు సైతం ఇక్కడికి రావడంతో ఆస్పత్రి నిత్యం గర్భిణులు, బాలింతలతో ఆస్పత్రి కిక్కిరిసిపోతోంది.

ప్రసూతి సేవలకోసం ఇతర జిల్లాల నుంచి..

మెదక్, వికారాబాద్ జిల్లాల నుంచి కూడా ప్రసూతి సేవల కోసం గర్భిణులు ఈ ఆస్పత్రికి వస్తున్నారు. అనుభవం కలిగిన గైనకాలజిస్టులు, అనస్తీషియా, చిన్నపిల్లల వైద్యనిపుణులు ఉండటంతో అతిక్లిష్టమైన కేసుల్ని కూడా ప్రసవాలు చేసి తల్లీ, బిడ్డల ప్రాణాలు కాపాడుతున్నారు.

ప్రోత్సాహంతో మరిన్ని మెరుగైన సేవలు



ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి దామోదర ఆదేశాలు, ప్రోత్సాహంతోనే ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలోని డాక్టర్లు, సిబ్బంది సమిష్టి కృషితో మెరుగైన సేవలు అందిస్తున్నాం. రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ అనిల్ కుమార్, సూపరింటెండెంట్

పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం



పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. అన్ని వర్గాల ప్రజలకు విద్య ,వైద్యం అందినప్పుడే ప్రజలు సంతోషంగా ఉంటారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. రానున్న రోజుల్లో మరెన్నో వైద్య సేవల్ని ప్రజలకు ఉచితంగా అందిస్తాము.

– దామోదర రాజనర్సింహ .. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి



ఈ ఏడాది జిల్లా ఆసుపత్రిలో జరిగిన ప్రసవాల వివరాలు..

నెల	సాధారణప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
జనవరి	421	284	705
ఫిబ్రవరి	331	273	604
మార్చ్	345	328	673
ఏప్రిల్	413	346	759
మే	401	381	782
జూన్	300	345	645
జూలై	371	335	706
ఆగస్టు	418	381	779
సెప్టెంబర్	358	354	712
అక్టోబర్	459	377	836

నేటి నుంచి అందోల్‌లో జోనల్ గేమ్స్

గురుకుల పాఠశాలలో సర్వం సిద్ధం

- పాల్గొననున్న హైదరాబాద్, రంగారెడ్డి సంగారెడ్డి జిల్లా బాలికలు
- పోటీలు ప్రారంభించనున్న మంత్రి దామోదర రాజనర్సింహా

జోగిపేట(అందోల్): గురుకుల పాఠశాలల బాలికల టెన్త్ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌మీట్, జోన్ 6 ఏ క్రీడాపోటీలు అందోల్‌లోని గురుకుల పాఠశాలలో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పోటీల్లో 10 గురుకుల పాఠశాలల్లోని బాలికలు పాల్గొననున్నారు. వివిధ పోటీలకు సంబంధించిన కోర్టులను క్రీడలకు సిద్ధం చేశారు. హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన చిట్కుల్, ఇస్నాపూర్, జహీరాబాద్, అందోల్, రాయికోడ్, వికారాబాద్, కోకట్, మోమిన్‌పేట్, బత్వారం, ఆర్‌కే పురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. టెన్త్ జోనల్ మీట్‌లో వాలీబాల్, బాల్ బాడ్మింటన్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖోఖో, టెన్నికైట్, చెస్, క్యారమ్ పోటీలు నిర్వహించనున్నారు. అండర్ 14,17,19 బాలికలు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొంటారు. పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో వివిధ పోటీలకు సంబంధించిన కోర్టులను పీఈటీ, పీడీల సహకారంతో సిద్ధం చేశారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ పోటీలలో పది గురుకుల పాఠశాలల నుంచి సుమారు 850మంది విద్యార్థినులు పాల్గొనున్నారు.



అందోల్ పాఠశాలలో పోటీలకు సిద్ధమవుతున్న బాలికలు

హాజరుకానున్న మంత్రి దామోదర

అందోల్‌లోని గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న టెన్త్ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌మీట్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. ఈ పోటీలకు అవసరమైన ఏర్పాట్లకు మంత్రి ఆర్థిక వనరులను కూడా సమకూర్చినట్లు సమాచారం. మంత్రి దామోదరతోపాటు ఎంపీ సురేశ్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రూపేశ్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల అధికారులు, అధ్యాపకులు హాజరు కానున్నారు.

ఏర్పాట్లు పూర్తి



టెన్త్ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 6వ జోనల్‌కు సంబంధించిన క్రీడాపోటీలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం. పోటీలను నిర్వహించేందుకు కోర్టులను కూడా పీఈటీ, పీడీలు సిద్ధం చేశారు.

– డాక్టర్ బీఎల్ సద్గుణ మేరీ గ్రేస్, ప్రిన్సిపాల్, అందోల్

క్లుప్తంగా

వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థి రేవేశ్


విద్యార్థిని అంకిత

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మడూర్ జెడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం చేగుంట మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అండర్ 14 విభాగంలో పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చి ఎస్.రేవేశ్, సీహెచ్.అంకితలు ఎన్నికయ్యారని పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు అల్లి నరేశ్ తెలిపారు. ఈ నెల 16 నుంచి 18 వరకు చేగుంట మోడల్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను తోటివిద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గోనె సంచుల గోదాంలో మంటలు

రూ. 3 లక్షల ఆస్తినష్టం


షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైన గోనె సంచులు

నిజాంపేట(మెదక్): స్థానిక మండలకేంద్రంలో శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ వల్ల గోనె సంచుల గోదాంలో మంటలు చెలరేగాయి. జిట్టి చంద్రశేఖర్‌కు గోనె సంచుల గోదాంలో షార్ట్ సర్క్యూట్ కారణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు గమనించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారొచ్చి మంటలు ఆర్పివేశారు. దీంతో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు వ్యాపారి తెలిపాడు.

సైబర్ కేటుగాడి పెళ్లి వల

రూ. 6.63 లక్షలను పోగొట్టుకున్న యువతి

పటాన్‌చెరుటౌన్: మీ ప్రొఫైల్ చూశాను నచ్చింది.. మిమ్మల్నే పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి డబ్బు వసూలు చేశాడు సైబర్ కేటుగాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అక్టోబర్ 23న షాదీ డాట్ కామ్‌లో పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఉన్న ఒక కాలనీకి చెందిన యువతి ప్రొఫైల్ చూసి నచ్చిందని, తాను స్వీడన్ లో ఉంటానని పెళ్లి చేసుకుంటానని అపరిచిత వ్యక్తి నమ్మించాడు. అనంతరం ఆమె కోసం వస్తున్నానని బుక్ చేసుకున్న ఫ్లయిట్ టికెట్‌లను చూపించాడు. దుబాయ్‌కి వచ్చాను కస్టమ్స్, మనీ ఎక్స్ఛేంజ్ వద్ద కొంత ఇబ్బంది తలెత్తింది. ఇప్పుడు నగదు పంపితే కలిసినప్పుడు ఇస్తానని యువతితో చెప్పగా నమ్మి రూ.6.63 లక్షలను పంపించింది. అనంతరం అతని నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.

వ్యక్తి అదృశ్యం


భూమయ్య

దుబ్బాక: టీ తాగేందుకు బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన దుబ్బాక పట్టణంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ గంగరాజు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి... పట్టణానికి చెందిన బెల్లే భూమయ్య గతనెల (అక్టోబర్ 17న) ఉదయం టీ తాగేందుకని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయిన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం తెలిసిన వారినీ, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆయన భార్య నర్సవ్వ ఫిర్యాదునివ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరి కోత .. కన్నీటి వెత

పంట కోత కోసేందుకు రైతులకు తప్పని అదనపు భారం

- ఎకరాకు రూ.5 వేలకు పైనే..
- భూమిలో దిగబడుతున్న హార్వెస్టర్లు
- చైన్‌మిషన్లతో కోయించాల్సిన దుస్థితి
- ఆందోళనలో అన్నదాతలు


కేసుగారి స్వామి, రైతు దుబ్బాక

దుబ్బాక: ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు దుబ్బాకకు చెందిన కేసుగారి స్వామి. తనకున్న 12 ఎకరాల్లో వరి వేశాడు. తీరా కోద్దామనుకుంటుండగా వర్షాలు కురిసి చేలలో నీరు నిలిచింది. దీంతో తప్పనిసరి పరిస్థితిలో చైన్ హార్వెస్టర్‌తో కోయించాల్సిన దుస్థితి. 12 ఎకరాలు కోసేందుకు సాధారణ హార్వెస్టర్‌కు 14 నుంచి 16 గంటలు పడుతోంది. ఇప్పుడు చైన్ మిషన్‌తో కోస్తే 22 గంటలకు పైగా సమయం తీసుకుంటోంది. కోసి వడ్లను రోడ్డుపైకి తెచ్చి ట్రాక్టర్‌లో పోయాల్సి వస్తోంది. 6 గంటలకు పైగా సమయం అధికమవుతోంది. కామన్ హార్వెస్టర్‌కు గంటలకు ధర రూ. 2వేలు కాగా చైన్ మిషన్‌కు 3 వేలు. దీంతో 30 వేలలో పూర్తి కావాల్సిన కోతకు ఇంకా రూ. 36 వేలు అదనపు భారం పడుతోంది. ఇది ఒక్క రైతు స్వామి సమస్యే కాదు తనలాంటి అనేక రైతులది కూడా.

రైతులకు తిప్పలే

జిల్లాలో ఈ వాకాకాలంలో కురిసిన భారీ వర్షాలతో పంటలకు చాలా నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన ఉన్న వరి పంటలు కోసేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఇటీవల 15 రోజుల క్రితం వరకు కూడా భారీ వర్షాలు పడడంతో భూములు అరకుండా తేమతోనే ఉన్నాయి. వరి కోసేందుకు రైతులు నరకయాతన పడుతున్నారు. టైర్ హార్వెస్టర్లు దిగబడుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ ధర పెట్టి చైన్ మిషన్లతోనే కోతలు కోయించాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లాలోని ఒక్క దుబ్బాకే కాకుండా సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లోను వరికోతలు కోసేందుకు రైతులు నరకయాతనపడుతున్నారు.

అధిక సమయం

వరి కోత కోద్దామంటే పొలాలు దిగబడుతుండడంతో చైన్‌మిషన్‌తోనే కోయాల్సిన పరిస్థితి. సాధారణ హార్వెస్టర్ గంటకు రూ.2 వేలు ఉంది. చైన్ మిషన్ గంటకు రూ.3 వేల నుంచి 3, 500లు. సాధారణ (టైర్లతో ఉన్న) హార్వెస్టర్ పొలాల్లో దిగబడుతుంది.


దుబ్బాకలో వరికోస్తున్న చైన్‌మిషన్

జిల్లాలో 40 శాతానికి పైగా

జిల్లాలో ఈ వానాకాలంలో 3.68 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. ఇప్పటి వరకు 40 శాతం వరకు 1.50 లక్షలకు పైగా ఎకరాల్లో వరి కోతలు కోయడం పూర్తి అయింది. ఇంకా 60 శాతం వరకు కోయాల్సి ఉంది. కోసిన కోతల్లో 25 శాతం వరకు చైన్‌మిషన్లు, ఫోర్ వీల్‌తోనే కోశారు.

వడ్లు పోసేందుకు రాలేని పరిస్థితి. అదే చైన్‌మిషన్ అయితే రోడ్డు వరకు వెళ్లి కోసిన వడ్లను పోసి వస్తుంది. దీంతో అధిక సమయం తీసుకుంటోంది. చైన్‌మిషన్‌కు ఎకరానికి అదనంగా రూ. 5 వేల నుంచి 6 వేల వరకు రైతుపై భారం పడుతుంది. అయినా తప్పనిసరి పరిస్థితి కావడంతో కోయించుకుంటున్నారు. అవి కూడా తీవ్ర కొరతగా మారడంతో రైతులు రోజూ ఎదురుచూడాల్సిన పరిస్థితి.

చైన్‌మిషన్‌కు డిమాండ్



నా 5 ఎకరాల వరికోతకొచ్చింది. చేనంతా నీరు నిలిచి తేమగా ఉండడంతో చైన్ మిషన్‌తోనే కోయాల్సిన పరిస్థితి. గంటకు రూ.3200లు. ఇప్పటికే చైన్ మిషన్‌లు దొరకడం లేవు. చాలామంది రైతుల పొలాలు దిగబడుతుండటంతో ఈ మిషన్లతోనే కోయించుకుంటున్నారు. నా చేను ఎప్పుడు కోస్తనో ఏమో అర్థం కావడం లేదు.

-కుర్మ పాపయ్య,రైతు

బొరబండ ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత

- చేపలు పట్టే విషయంలో ధర్మారం, వర్ధరాజ్‌పూర్ గ్రామస్తుల వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం
- ప్రాజెక్టులో వ్యక్తి మృతదేహం గుర్తింపు
- కుటుంబ సభ్యుల ఆందోళన
- దర్యాప్తులో కేసు


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, చిత్రంలో పోలీసులు, గ్రామస్తులు


సత్తయ్య (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ధర్మారం, వర్ధరాజ్‌పూర్ గ్రామస్తుల మధ్య శనివారం చోటుచేసుకున్న వాగ్వాదం కాస్తా ఉద్రిక్తతకు దారితీసింది. ధర్మారం మత్స్యకారులు చేపలు పడుతుండగా, వర్ధరాజ్‌పూర్ మత్స్యకారులు తమకు కూడా వాటా ఉందని పెద్ద ఎత్తున బొరబండ ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. దీంతో చేపలు పట్టే విషయంలో గొడవ పడ్డారు. విషయం తెలుసుకున్న జగదేవ్‌పూర్, మర్కూక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలను సముదాయించి నచ్చజెప్పారు. పోలీసుల రాకను గమనించి పలువురు అప్పటికే పరుగులు తీశారు.

ప్రాజెక్టులో మృతదేహం లభ్యం.. కుటుంబసభ్యుల ఆందోళన

వర్ధరాజ్‌పూర్ గ్రామస్తులతో కలిసి సత్తయ్య ప్రాజెక్టు వద్దకు శనివారం వెళ్లాడు. రాత్రి అయినా ఎంతకీ ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబీకులు.. గ్రామస్తులను ఆరా తీశారు. వారి వెంట వెళ్లినట్లు తెలుసుకున్నారు. అప్పటికే తండ్రి కోసం కొడుకు తెలిసిన వారినీ, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఇదే రోజు మధ్యాహ్నం ప్రాజెక్టు వద్ద చెప్పులు కనిపించాయి. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కూడా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో సత్తయ్య మృతదేహాన్ని ప్రాజెక్టులోంచి బయటికి తీశారు. కుటుంబీకులు బంధువులు ఇక్కడే ఆందోళన నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ మహేందర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులను సముదాయించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరుగులు తీసే క్రమంలో అందులో పడి చనిపోయి ఉంటాడని సమాచారం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. రెండు రోజులుగా ప్రాజెక్టు వద్ద పోలీసు బలగాలు భారీగా చేరుకుని పహారా కాస్తున్నాయి.

రోయింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


రోయింగ్ పోటీల్లో అశ్వథామ


అశ్వథామ

మద్దూరు(హుస్నాబాద్): జాతీయ స్థాయి రోయింగ్ పోటీల్లో హకీంపేట తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థి, దూళ్మిట్ట మండలకేంద్రానికి చెందిన నాచగొని అశ్వథామ రెండు పతకాలు సాధించాడు. అక్టోబర్ 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్ నిర్వహించిన 25వ జాతీయ స్థాయి రోయింగ్ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించాడు. నవంబర్ 5న నుంచి కేరళ రాష్ట్రం అలిపిలో ఆలిండియా ఇంటర్ స్పోర్ట్ అథారిటీ ఇండియా–2024 రోయింగ్ చాంపియన్‌షిప్‌లో రజిత పతకం గెలిచాడు. కుమారుడు రెండు పతకాలను సాధించడం పట్ల తల్లిదండ్రులు నాచగొని పద్మావెంకట్‌గౌడ్ దంపతులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌తో మరిన్ని పతకాలు సాధించి గ్రామానికి పేరు తీసుకు రావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

కనులపండువగా కార్తీక దీపోత్సవం



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు ఆదివారం సాయంత్రం ఆలయ ముఖ మండపంలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని టోకరా

టీచర్‌కు నుంచి రూ.1.15 లక్షలను కాజేసిన సైబర్ నేరగాళ్లు

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంచుతామంటూ సైబర్ నేరగాళ్లు ఓ ప్రైవేట్ టీచర్ నుంచి నగదు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంచుతామంటూ అక్టోబర్ 22న పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ టీచర్‌కు అపరిచిత వ్యక్తులు సంప్రదించారు. దీంతో బాధితురాలు వారు చెప్పిన విధంగా చేసి తన వివరాలను చెప్పింది. దీంతో వెంటనే ఖాతాలో ఉన్న రూ.1.15 లక్షలను రెండు దఫాలుగా డ్రా చేసినట్టు మెసేజ్ రాగా మోసపోయినట్లు గుర్తించింది. సైబర్ క్రైమ్ పోలీసులకు, పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


ఇలియాస్(ఫైల్)

జహీరాబాద్ టౌన్: ఈతకు వెళ్లి బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలోని శేఖాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. జహీరాబాద్‌లో ఉన్న ఐడీఎస్‌ఎంటీ కాలనీకి చెందిన ఎండీ ఇలియాస్ (14) పూల దుకాణంలో పని చేస్తున్నాడు. మిత్రులతో కలిసి తాను మండలంలోని శేఖాపూర్ గ్రామ సమీపంలో గల చెరువు వద్దకు ఈతకు వెళ్లాడు. లోతు తెలియక లోపలికి జారిపోయి నీటిలో మునిగి ఇలియాస్ మృతిచెందాడు. చెరువు గట్టుపై ఉన్న మిత్రులు మునిగిపోతుండటాన్ని గమనించి పెద్దగా కేకలు వేయడంతో గ్రామస్తులు చేరుకున్నారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. జహీరాబాద్ రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి తల్లిదండ్రులు లేనట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొండకండ్ల శివారులో రోడ్డు ప్రమాదం

- డీసీఎంను వెనుక నుంచి ఢీకొన్న కారు
- నలుగురికి తీవ్రగాయాలు
- అటుగా వెళ్తూ ఆగిన మంత్రి పొన్నం
- క్షతగాత్రులకు సహాయక చర్యలు


ఘటన స్థలంలో మంత్రి పొన్నం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్, ముగ్గురు మహిళలు గాయపడ్డారు. ఇటుగా వెళ్తూ ఆగి క్షతగాత్రులకు సహాయక చర్యలు చేపట్టారు మంత్రి పొన్నం ప్రభాకర్. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి సిద్దిపేటకు చెందిన చిన్నకోడూర్ మండలం మందపల్లికి చెందిన మహిళలు మురికి పద్మ, కనకవ్వ, స్వప్నలు హైదారాబాద్‌లో పూలు కొనడానికి ఆటోలో వెళ్లారు. సరుకు కొని ఆదివారం తిరిగొస్తుండగా కొండకండ్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దానిని వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ ఎండీ దావుద్‌కు కాళ్లు, చేతులు విరిగాయి. ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమయంలో ఇటుగా వాహనంలో వెళ్తుండగా మంత్రి పొన్నం ప్రభాకర్ గమనించి క్షతగాత్రుల వద్దకు వెళ్లి ధైర్యం చెప్పారు. 108లో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆటో డ్రైవర్ దావుద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

బైక్ రేసింగ్‌కు వెళ్తున్నానని..

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

తూప్రాన్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ రైడర్ ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని కరీంగూడ సమీపాన 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరికి చెందిన దుల్జిత్‌సింగ్ తన స్నేహితుడితో కలిసి బైక్ రైసింగ్‌కు వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు. కరీంగూడ సమీప వద్ద రహదారి పక్కన ఆపి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. సమాచారం అందుకున్న అంబులెన్స్ ఇక్కడికి చేరుకుని గాయపడిన దుల్జిత్‌సింగ్‌ను మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. అతని స్నేహితుడు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. దుల్జిత్‌సింగ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు, వ్యక్తి మృతి


సత్తయ్య మృత దేహం


కొండపాక(గజ్వేల్) : బోల్తా పడిన కారు

బెజ్జంకి(సిద్దిపేట): కారు.. బైక్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని గాగిళ్లాపూర్ శివారులోని రాజీవ్ రహదారిపైన ఆదివారం చోటుచేసుకుంది. బెజ్జంకి ఏఎస్ఐ శంకర్‌రావు, స్థానికులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. గ్రామానికి చెందిన వృద్ధుడు ఆకెన సత్తయ్య (65) గుగ్గిల్లలో గల బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగొస్తుండగా గాగిళ్లాపూర్ గ్రామ స్టేజీ సమీపంలో గల రాజీవ్ రహదారిపైకి రాగానే.. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. తీవ్ర గాయాలయైన సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య గతంలోనే మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలున్నారు. ఇప్పటి వరకు ఫిర్యాదు రాలేదని ఏఎస్ఐ తెలిపారు.




కొండపాక(గజ్వేల్) : గాయపడిన రోహన్, సాయిగణేశ్, రాహుల్

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

కొండపాక(గజ్వేల్): అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి కారు బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక మండలం మర్పడ్గ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి హైదారాబాద్‌కు చెందిన రోహన్, రాహుల్, లోకేశ్, అభి, సాయిలు కలిసి కొండపాక మండలం సిర్సనగండ్లకు ఉంటున్న మిత్రుడు సాయి గణేశ్ వద్దకు కారులో వచ్చారు. ఆదివారం ఉదయం అతనితో కలిసి వారు సిద్దిపేటలో పని నిమిత్తం కారులోనే వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మర్పడ్గ గ్రామ శివారులో చెరువు కట్ట మలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీని తప్పించే క్రమంలో రోడ్డు కిందకు దూసుకెళ్లి కారు బోల్తా పడింది. దీంతో రోహన్, సాయిగణేశ్, రాహుల్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతింది.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు


సమావేశంలో మాట్లాడుతున్న రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మిక సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఐలా భవన్ లో జరిగిన కిర్బీ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పైన నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ మాత్రమేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, యూనియన్ నాయకులు వీఎస్ రాజు, నాగ ప్రసాద్, ఏడుకొండలు, లఖాన్, లక్ష్మణ్, వెంకట్, జైపాల్ ,మహేశ్వర్ రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

బాలుర ఛాంప్ వరంగల్



బాలికల విభాగం విజేత ఆదిలాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- బాలికల చాంపియన్‌గా ఆదిలాబాద్
- రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు విజయవంతం
- మంత్రి పొన్నం చేతులమీదుగా విజేతలకు బహుమతులు

హుస్నాబాద్: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాలబాలిక హ్యాండ్ బాల్ ఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా పొన్నం ప్రభాకర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాలల సమాఖ్య అండర్ -14 బాల బాలికల 68వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు ఈ నెల 8న ప్రారంభమై ఆదివారంతో ముగిశాయి. రాష్ట్ర స్థాయి బాలికల చాంపియన్‌గా ఆదిలాబాద్, బాలుర చాంపియన్‌గా వరంగల్ జట్టు నిలిచింది. అండర్–14 బాలికల విభాగంలో వరంగల్ ద్వితీయ, హైదరాబాద్ తృతీయ, నిజామాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. అలాగే బాలుర విభాగంలో కరీంనగర్ ద్వితీయ, రంగారెడ్డి తృతీయ, నిజామాబాద్ నాలుగో స్థానాన్ని సాధించాయి. వివిధ జట్టుకు ట్రోఫీలు, షీల్డ్‌లను మంత్రి ప్రభాకర్ అందించారు.

మినీ స్టేడియం క్రీడా పోటీలకు వేదికగా..

హుస్నాబాద్‌లో ఉన్న మినీ స్టేడియంలో మొదటిసారిగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు. మినీ స్టేడియం విస్తీర్ణాన్ని పెంచుకొని రాబోయే కాలంలో అన్ని క్రీడలకు వేదిక కావాలన్నారు. క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వం ద్వారా అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి సియోల్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీని చూసిన తర్వాత స్ఫూర్తి పొంది యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాబోయే ఈ వర్సిటీలో హుస్నాబాద్ నుంచి అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందాలని ఆకాంక్షించారు. మినీ స్టేడియంలో స్విమ్మింగ్‌పుల్, డ్రెస్సింగ్ రూమ్, టాయిలెట్లు, షటిల్ కోర్టులో సింథటిక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ స్టేడియంలోనే మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించాలని ఎంఈఓ మనీలను ఆదేశించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్ నళిని దేవి, రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకట నర్సయ్య, కో ఆర్డినేటర్లు శ్రీనివాస్, బూట్ల రాజ మల్లయ్య , పీడీలు సత్యనారాయణ రెడ్డి, రాజారెడ్డి, ఓం ప్రకాశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.


ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న ఇరు జట్లు